క్లుప్తంగా

జాతీయ తైక్వాండో పోటీల్లో విజేతకు అభినందన



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): గత నెల 24, 25 తేదీల్లో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లోని ఖాన్‌దుబాయ్ సేనైహాల్‌లో జరిగిన 37వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి రజత పతకం సాధించాడని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మండవ సాంబశివరావు తెలిపారు. కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ సీఈసీ చదువుతున్న టి.ప్రవీణ్ అండర్–18 బాలుర విభాగంలో 70 కేజీల వెయిట్ సామర్థ్యంలో సెల్ఫ్ డిఫెన్స్ విభాగంలో రజత పతకం సాధించాడన్నారు. ప్రవీణ్‌ను కళాశాల వ్యాయామ అధ్యాపకుడు కె.మార్కండేయులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

బధిర ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా బధిర, విభిన్నప్రతిభావంతుల ఉద్యోగుల సంఘం రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ ఆవిష్కరించారు. గాంధీనగర్ ఎన్జీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బధిర, విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగులు మొక్కవోని ధైర్యంతో విధులను నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. బధిర ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బధిర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు వై.శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.పాండురంగారావు, సహాధ్యక్షులు బి.లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యక్షుడు డి.శివకుమార్, సెక్రటరీ టి.టి.దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీ షేక్ ముస్తఫా, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, మహిళా కార్యవర్గ సభ్యులు ఏ.నాగ దీప్తి, పి.కృష్ణకుమారి, ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు సీహెచ్ శ్రీరామ్, కార్యదర్శి కె.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి బొత్సకు డైరీ, క్యాలెండర్ అందజేత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్లు జమల పూర్ణమ్మ, మధుబాల మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి బొత్సకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రంథాలయ సంస్థ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని అందజేశారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో జనవరి 7వ తేదీ నుంచి వివిధ అంశాల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీ కేర్ అసిస్టెంట్, జ్యూట్ క్రాఫ్ట్ ప్రొడక్ట్స్ మేకర్, అసిస్టెంట్ ప్లంబింగ్ శానిటరీ వర్క్, అసిస్టెంట్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ, కట్టింగ్ అండ్ టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ రిపేర్, హోమ్ క్రాఫ్ట్స్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ అంశాల్లో శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866–2470420 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజాస్వామ్యంలో ఓటు ఆవశ్యకత ఎంతో ఉందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత తెలిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని ఫార్మసీ కళాశాలలో ఈ నెల 3, 4 తేదీల్లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. ఓటు నమోదు విధానాన్ని విద్యార్థులకు వివరించారు. విధిగా ఓటును వినియోగించుకోవడం ద్వారా మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తులు మంచి ప్రభుత్వాల ద్వారానే సాధ్యమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఓటువేయడం ద్వారా ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 90 మంది విద్యార్థులు ఓటును నమోదు చేశారు.

పింఛన్ పెంపుతో పేదలకు కొండంత భరోసా



వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్లు

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- ఉత్సాహంగా పింఛన్ వారోత్సవాలు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో పింఛన్ పెంపుతో పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత భరోసానిచ్చారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 57, 58, 61, 63, 64 డివిజన్లకు సంబంధించి 64వ డివిజన్ ప్రజాశక్తినగర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం జరిగిన పింఛన్ వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లలతో కలిసి నూతన లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పింఛన్‌దారుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004లో రూ.75 ఉన్న పింఛన్‌ను 200 రూపాయలు చేశారని గుర్తు చేశారు. ఆయన తనయుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని అవంతరాలు వచ్చినా, ఎదుర్కొని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఏటా పింఛన్‌ను పెంచుతున్నారని చెప్పారు. అంతే కాకుండా పింఛన్ పొందేందుకు అర్హతను 65 నుంచి 60 ఏళ్లకు కుదిరించారన్నారు. గడప గడపకు వెళుతున్న సమయంలో పింఛన్ రాలేదన్న వారికి కూడా పింఛన్ అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత తెలుగుదేశం హయాంలో ఫించన్ల కోసం నిరుపేదలు జన్మభూమి కమిటీల వద్ద పైరవీలు చేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు.

ప్రతి ఒక్కరికీ పింఛన్..

చంద్రబాబు హయాంలో నియోజకవర్గంలో 17,232 మాత్రమే ఉన్న పింఛన్లను వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే 26,418 మంది లబ్ధిదారులకు పెంచామని ఎమ్మెల్యే విష్ణు చెప్పారు. ఏడాదికి రెండుసార్లు ఆగస్టు, డిసెంబర్ మాసాల్లో నూతన పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. పెన్షన్ల పంపిణీకి నియోజకవర్గంలో ప్రతి నెలా 7కోట్ల 18లక్షల 24వేల 500 రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో పింఛన్ల కోసం అవ్వాతాతలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేదని ఆయన గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వంలో లబ్ధిదారులు ఉన్న చోటుకే వలంటీర్లు వెళ్లి పింఛన్ అందిస్తున్నారన్నారు.

పింఛన్లపై వదంతులు నమ్మొద్దు

పింఛన్లపై ప్రతిపక్షాల వదంతులు నమ్మొద్దని, ఈ నెలలో ఏ ఒక్కరికీ పింఛనను రద్దు చేయలేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కేవలం ఇన్‌కంటాక్స్ చెల్లించే వారికి, కార్లు ఉన్న వారికి మాత్రమే పింఛన్‌ను నిలిపివేశామన్నారు. రాజమహేంద్రవరంలో ఆస్పత్రికి వెళ్లి వస్తున్న వృద్ధురాలికి జరిగిన ప్రమాదాన్ని ప్రతిపక్షాలు వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని ఎమ్మెల్యే విష్ణు మండిపడ్డారు. జరిగిన వాస్తవాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. అనంతరం నూతన సంవత్సరంలో పెంచిన పింఛన్‌ను అందుకున్న లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేమంటూ కొనియాడారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ జి.సుజనా, సీడీఓ జగదీశ్వరి, కార్పొరేటర్లు యర్రగొర్ల తిరుపతమ్మ, ఇసరపు దేవి, ఉమ్మడి రమాదేవి, మోదుగుల తిరుపతమ్మ, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, ఇసరపు రాజు, జిల్లేళ్ల శివ, ఎస్‌కే ఇస్మాయిల్, పసుపులేటి ఏసు, సీహెచ్.రవి, మోదుగుల గణేష్, కాళ్ల ఆదినారాయణ, ఎండీ అఫ్రోజ్, ఎండీ నజీర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు



మధురానగర్‌లో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ లక్ష్మీపతి తదితరులు

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- మధురానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలను అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ 209వ వార్డు సచివాలయం పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. దేశం యావత్తూ మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. అనంతరం ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట్ల రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన ఒక స్వర్ణయుగంగా సాగుతోందన్నారు. నాలుగు డివిజన్ల ప్రజల రాకపోకలకు అనువుగా ఉండేందుకు చేపట్టిన మధురానగర్ ఆర్‌యూబీను వేసవి నాటికి వినియోగంలోకి తీసుకువస్తామని మల్లాది విష్ణు తెలిపారు. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయంగా తారు రోడ్లు నిర్మిస్తామన్నారు. మధురానగర్‌లో నిరంతర తాగునీటి సరఫరా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలే ముఖ్యం..

అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీఓలు అన్ని రాజకీయ పార్టీలకు ఒకేలా వర్తిస్తాయని, నిబంధనల విషయంలో వైఎస్సార్‌సీపీకు ఎటువంటి మినహాయింపు లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలే ముఖ్యమని అందుకునే జీఓ నంబర్ ఒకటి జారీ చేశామని చెప్పారు. జీఓ నంబర్ ఒకటిపై పచ్చమీడియా వక్రభాష్యం మానుకోవాలని హితవు పలికారు. గుంటూరులో టీడీపీ దుర్మార్గపు చర్యను సమాజమంతా ముక్తకంఠంతో ఖండిస్తుంటే జనసేన, బీజేపీ, వామపక్షాలు సమర్థించేలా మాట్లాడటం బాధాకరమన్నారు. చంద్రబాబు చేతకాని తనం వల్లే ప్రత్యేక హోదా అటకెక్కి ప్రత్యేక ప్యాకేజీ తెరపైకి వచ్చిందన్నారు. అటువంటి టీడీపీతో కలిసి నగరంలో సీపీఐ, సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించటం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సోదరుడి అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): తన సోదరుడు అదృశ్యంపై మద్దాల వెంకట సుబ్బారావు అనే వ్యక్తి బుధవారం నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన ఫిర్యాది తమ్ముడు మద్దాల శ్రీనివాసరావు(35) అవివాహితుడు, పాతరాజీవ్‌నగర్ వద్ద చిల్లర దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. శ్రీనివాసరావుకు, స్థానికులకు మధ్య గత నెల 30న గొడవ జరిగిందన్నారు. ఆ రోజు నుంచి తన తమ్ముడు కనిపించడంలేదని సుబ్బారావు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

గురుకుల కళాశాలలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలో బుధవారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల కోసం లిపిని కనిపెట్టి వారి జీవితాలలో నూతన వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి బ్రెయిలీ అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న పోలీసులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు సహాయం అందిస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులు మరోమారు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రావణి తండ్రిని కోల్పోయింది. తల్లి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో శ్రావణికి బీఫార్మసీలో సీటు వచ్చిన నేపథ్యంలో మొదటి సంవత్సరం కాలేజీ ఫీజు కట్టేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో దీవెన ఫౌండేషన్ గురించి తెలుసుకున్న ఆమె వారిని సంప్రదించింది. వెంటనే స్పందించిన వారు బుధవారం ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును ఆయన చాంబర్‌లో కలుసుకుని ఆయన చేతుల మీదుగా 15 వేల రూపాయలను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ బ్రహ్మం, శరత్‌కుమార్, గోపిచంద్ పాల్గొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ పేదలకు సాయం చేయడంలో ఫౌండేషన్ ముందుంటుందన్నారు.

మహిళా సాధికారతకు కృషి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళా ప్రతినిధులు

పాయకాపురం(విజయవాడరూరల్): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తోందని జిల్లా ఇండస్ట్రీ సెంటర్ జనరల్ మేనేజర్ వీర శేఖర్ తెలిపారు. ఎంఎస్ఎంఈ–డీఎఫ్ఓ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ, విశాఖపట్నం కన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్(సీఓడబ్ల్యూఈ) కోవె వారి సౌజన్యంతో 30 రోజుల ఎంట్రప్రెన్యూర్షిప్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, అడ్వాన్స్‌డ్ ఫ్యాషన్ డిజైనింగ్ టెక్నాలజీ బుధవారం కండ్రిక వద్ద ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీర శేఖర్ మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ప్రవేశపెట్టిన పథకాలను, జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్‌లో అమలు అవుతున్న పథకాలను వివరించారు. కోవె ప్రెసిడెంట్ రాధిక 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ)ను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చంద్రమౌళి భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల గురించి వివరించారు. ట్రైనర్ ఎస్.హర్షిణి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె బుధవారం తన ఛాంబర్‌లో కార్యాలయ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఫ్ఆర్ఎస్ అమలు, కార్యాలయం పరిపాలన పరమైన వ్యవహారాలు, బాధ్యతలు, సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణ వంటి అంశాలపై సమీక్షించి తగు ఆదేశాలిచ్చారు. అదే విధంగా ఫైల్స్ క్లియరెన్స్, పని నాణ్యత వంటి అంశాలపై కూడా సమీక్షించారు. కార్యక్రమంలో గణాంక అధికారి ఎస్.లక్ష్మోజీ, సూపరింటెండెంట్ వి.శ్రీనివాసరావు, డెప్యూటీ గణాంక అధికారి బి.గోపాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌లు సీతాకళ్యాణి, ప్రసూనాంబ, కె.వాసు, ఆనందరావు, 104 జిల్లా సమన్వయ అధికారి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు



33వ డివిజన్‌లో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధికి తమ ప్రభుత్వం ధృడ సంకల్పంతో పని చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలోని మైలవరపు జమీందారు వీధి, పాపరాజువారివీధి, కావూరివారి వీధుల్లో రూ.16.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్లను నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం 14వ ఆర్థిక సంఘం నిధులు కోటి రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీ పైపుల ఏర్పాటు పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా వేసిన రోడ్లు తప్ప గత తెలుగుదేశం ప్రభుత్వం కనీసం రోడ్లను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్ల నిధులతో డివిజన్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నట్లు తెలిపారు. పరిపాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరెవరూ సాటిరారని స్పష్టం చేశారు. అనంతరం నగర సుందరీకరణలో భాగంగా స్థానికులతో కలిసి నూతన రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, కార్పొరేటర్ జానారెడ్డి, డివిజన్ కో ఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు శనగవరపు శ్రీనివాస్, కమ్మిలి రత్నకుమార్, కొల్లూరు రామకృష్ణ, రంగబాబు, రాజశేఖర్, సనత్, చాంద్, కోలవెన్ను రమణ, నాళం రామలింగేశ్వరరావు, చామర్తి మూర్తి, సచివాలయం, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ ఈ.స్వరాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక సత్యనారాయణపురం శ్రీ విజ్ఞాన విహార ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విలువైన జీవితం నాశనమవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరమని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తటంతో పాటు సంఘంలో గౌరవం కోల్పోతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.దుర్గారావు పాఠశాల ప్రిన్సిపాల్ షణత్‌కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో ధీమా



చెక్కు అందజేస్తున్న సుందర్‌పాల్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ బీమాతో నిరుపేద కుటుంబాల్లో ధీమా కల్పిస్తున్నామని కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక 27వ డివిజన్‌లో గుండెపోటుతో మృతి చెందిన ఆర్.వెంకట రమణ కుటుంబానికి బుధవారం వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు వైఎస్సార్ బీమా దోహదపడుతుందన్నారు. అనంతరం వెంకట రమణ భార్య దుర్గాభవానికి చెక్కును అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆచారి, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో..

32వ డివిజన్‌లో బుధవారం వైఎస్సార్ బీమా రూ.లక్ష చెక్కును నగరపాలకసంస్థ కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి సుందర్‌పాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేందుకు వైఎస్సార్ బీమా ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు జైనుల మౌన ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలోని వివిధ ప్రాంతాల్లో జైనుల పుణ్యక్షేత్రాల రక్షణ కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం మౌన ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు విజయవాడ జైన్ సంఘ్ కన్వీనర్ పన్నాలాల్‌జైన్ చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఆ సంఘ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జైనులు మైనార్టీలుగా ఉన్నారన్నారు. తక్కువ సంఖ్యలో ఉన్న తమకు, తమ పుణ్యక్షేత్రాలను కాపాడేందుకు, రక్షణ కల్పించేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉదయం తొమ్మిది గంటలకు మౌన ప్రదర్శనలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా జైనుల అత్యంత పవిత్రమైన తీర్థ క్షేత్రమైన గుజరాత్‌లోని శ్రీ శత్రుంజయ తీర్థంపై ఇటీవల కొంతమంది దుండగలు దాడి చేసి అక్కడ భగవంతుని పాదాలను ధ్వంసం చేశారన్నారు. అలాగే జార్ఖండ్‌లోని శిఖర్జి తీర్థ ప్రదేశానికి పర్యాటక కేంద్రంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జైనులు పూర్తి శాఖాహారాన్ని పాటించటమే కాకుండా అనేక కఠిన నియమాలను ఆచరిస్తూ జీవితాలను కొనసాగిస్తారన్నారు. అటువంటి జైన పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించటం వలన జైనుల సిద్ధాంతాలకు విరుద్ధంగా అక్కడి కార్యకలాపాలు జరిగే ప్రమాదముందన్నారు. తక్షణం జార్ఖండ్ ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చే నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. వీటిపై దేశ వ్యాప్తంగా జైనులు నిరసనలు తెలియజేసి ప్రభుత్వానికి తమ విన్నపాలను వివరించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా విజయవాడలో మౌనప్రదర్శనగా వెళ్లి కలెక్టర్‌ను, గవర్నర్‌ను కలిసి వినతిపత్రాలను అందిస్తామని చెప్పారు. జైన సమాజ్ నాయకులు మనోజ్ కొఠారి, అశోక్‌జైన్, భోగిలాల్‌జైన్, సందీప్‌కాన్కరియా, సంజయ్‌జైన్, రాజు జైన్, మహేంద్రజైన్, ప్రవీణ్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్టీఎస్ రోడ్డుకు మరమ్మతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డుకు మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రహదారిపై గోతులు పడడంతో మరమ్మతు పనులు నిర్వహించారు. భానునగర్ జంక్షన్ నుంచి పడవల రేవు సెంటర్ వరకు బుధవారం పనులు జరిగాయి. దీంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



